సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



అధ్వాన రోడ్లతో అవస్థలు

ఆదిలాబాద్ పట్టణంలోని అంతర్గత రోడ్ల అధ్వానంగా మారాయి. మున్సిపల్ పరిధిలోని ఏ కాలనీలో చూసిన గుంతలమయమైన రోడ్లే దర్శనమిస్తున్నాయి 11లో▸



56వ రోజుకు 'డివిజన్' దీక్ష

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలంటూ మండలకేంద్రంలో చేపట్టిన దీక్ష 56వ రోజుకు చేరింది. శనివారం నాటి దీక్షలో సీఆర్ ఫ్రెండ్స్, సాయినగర్ వాసులు కూర్చున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.


ఓ క్షణం.. ఆలోచించు



క్షణికావేశం నిండు ప్రాణాన్ని బలిగొంటుంది. నువ్వొక్కడివే కాదు.. నీపై ఆధారపడిన వారి జీవితాలను ఛిద్రం చేస్తుంది. సమస్యలెన్ని ఉన్నా.. క్షణం ఆలోచించి చూడు.. పరిష్కారం దొరుకుతుంది. భవిత బంగారమవుతుంది. రోజులో పగలు, రాత్రి ఎంత సహజమో.. జీవితంలో కష్టసుఖాలూ అంతే. సుఖమొచ్చినప్పుడు పొంగిపోవద్దు. కష్టమొచ్చినప్పుడు కుంగిపోవద్దు. ఈ రెండింటిని సానుకూల దృక్పథంతో సమానంగా భావించి ముందుకు సాగితే ఎంత పెద్ద సమస్యనైనా సులువుగా అధిగమించవచ్చు. అయితే కొందరు చిన్న చిన్న కారణాలకే ఆత్మహత్యకు పాల్పడుతూ విలువైన జీవితానికి ముగింపు పలుకుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కన్నవారికి, కట్టుకున్న వారికి దూరమవుతూ పుట్టెడు దుఃఖాన్ని మిగులుస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

నాలుగేళ్లలో జిల్లాల వారీగా నమోదైన ఆత్మహత్యలు..

- వివరాలు 10లో▸



న్యూస్‌రీల్

మట్టి గణనాథులను నెలకొల్పాలి



మాట్లాడుతున్న హన్మాండ్లు

ఎదులాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణేశ్ విగ్రహాలను నెలకొల్పాలని గణపతి హిందూ సమాజ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు హన్మండ్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదపండితులతో చర్చించి నవరాత్రోత్సవ తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి ప్రారంభించి, నిమజ్జనం 28న జరుపుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో హిందూ సమాజ్ ఉత్సవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి లెనిన్, ఉదయ్, వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు శ్రీరాంశర్మ తదితరులు పాల్గొన్నారు.

15న చిత్రలేఖన పోటీలు

కైలాస్‌నగర్: ఓటు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 15న 'నైతిక ఓటు– ప్రజాస్వామ్యంలో దాని ప్రాముఖ్యత' అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలో గల అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న పోటీలకు జిల్లా వాసులై ఉండి, 15 ఏళ్లు నిండి, పెయింటింగ్‌పై ఆసక్తి కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుతుల కింద రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు. మరో పది మందికి మెమోంటో పాటు ప్రశంసపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కల వారు పెయింటింగ్‌కు అవసరమైన సామగ్రిని తెచ్చుకోవాలని సూచించారు. డ్రాయింగ్ పేపర్, చార్ట్స్ మాత్రం ఉచితంగా అందజేయనున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు 9849913061 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్


ఆదిలాబాద్‌రూరల్: వివిధ శాఖల ద్వారా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. మావల మండల ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీని మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల రికార్డులను పంచాయతీల వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న పనులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల సంగీత, జెడ్పీటీసీ వనిత, ఏపీడీ రవీందర్, ఎంపీడీవో అరుణ,ఎంపీవో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భజనతో 'సమగ్ర' ఉద్యోగుల నిరసన

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమ్మె చేపట్టిన సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల రోజుకో రీతిన వినూత్న నిరసనలు కొనసాగిస్తున్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన శిబిరంలో శనివారం భజన చేసి పాటలు పాడుతూ సర్కారు తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీరి ఆందోళనకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాధికారులు శ్రీనివాస్, శ్రీకాంత్, ఉదయ్‌రావు, నారాయణ మద్దతు తెలిపారు. శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. డిమాండ్లు నెరవేరే దాకా అండగా ఉంటామని పేర్కొన్నారు. అలాగే ఆదివాసీ ప్రధాన్ ఉద్యోగుల సంఘం నాయకులు వీరి పోరాటానికి మద్దతుగా ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కమలంపై ఆశలు

- తెరపైకి 'సోయం' తనయుడు
- బోథ్ టికెట్ కోసం నేడు దరఖాస్తు
- బీజేపీలో ఆసక్తికర పరిణామాలు
- ఎంపీ బాపూరావు అసెంబ్లీ పోరుకు దూరమేనా..?
- నియోజకవర్గాల్లో పోటాపోటీగా ఆశావహుల యత్నాలు





ఎంపీ సోయం బాపూరావుతో ఆయన తనయుడు సోయం వెంకటేశ్

సాక్షి,ఆదిలాబాద్:ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు తనయుడు వెంకటేశ్ బీజేపీ అభ్యర్థిగా బోథ్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో పార్టీకి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిణామాలు బీజేపీలో ఆసక్తి కలిగిస్తున్నాయి. ఎంపీ బాపూరావు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అనాసక్తి కనబరుస్తున్నారు. అయితే తన తనయున్ని రంగంలోకి దించే విషయం ఎన్నికల సందడి మొదలైనప్పటి నుంచి గోప్యంగా ఉంచారు. శనివారం సోయం వెంకటేశ్ పోటీ చేస్తారనే విషయం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. దీంతో బోథ్ నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో సంచలనం కలిగిస్తుంది.

ఆసక్తికరం..

పార్టీ పరంగా బోథ్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తూ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకటి దశరథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడె మానాజీ ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు రిటైర్డ్ పోలీసు అధికారి గోద్రు, శాంతాపూర్ మాజీ సర్పంచ్ విజయ్‌జాదవ్ కూడా దరఖాస్తులు సమర్పించారు. ఇంకా ఈ నియోజకవర్గం నుంచి అధ్యాపకుడు బలరాం జాదవ్ కూడా మొదటి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. అయితే ఆయన ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేదు. ఇక సోయం బాపూరావు అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నుంచి బరిలో దిగడం ఖాయమని మొదటి నుంచి ప్రచారం సాగింది. అయితే ఇటీవల ఈ ఎన్నికల్లో పోటీపై తనకు ఆసక్తి లేదని అనుచరుల వద్ద వెల్లడించారు. అయితే తన తనయుడు వెంకటేశ్‌ను బరిలోకి దించే విషయంలో మాత్రం గోప్యత పాటించారు. తాను కొద్ది కాలంగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ నియోజకవర్గంలో పర్యటిస్తూ వచ్చారు. బోథ్ నియోజకవర్గం నుంచి సోయం వెంకటేశ్ పోటీ చేస్తారని అప్పట్లో ప్రచారం జరిగినప్పటికీ ఆ తర్వాత ఆ విషయం పెద్దగా ప్రస్తావనకు రాలేదు. తాజాగా మళ్లీ ఆయన దరఖాస్తు చేస్తున్నారని పార్టీలో చర్చ మొదలైంది.

నేటితో ముగియనున్న దరఖాస్తు ప్రక్రియ

బీజేపీలో నియోజక వర్గాల నుంచి పలువురు ఆశావహులు టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆదివారంతో ఈప్రక్రియ ముగియనుంది. ఆదిలాబాద్ నుంచి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వామన్‌రెడ్డి కోడలు చిల్కూరి జ్యోతిరెడ్డి, మావలకు చెందిన బోరంచు గంగారెడ్డి, బడాల విలాస్‌రెడ్డి, తాంసికి చెందిన సామ సంతోశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు వి.ఆదినాథ్ దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆదివారం దరఖాస్తు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. పట్టణఅధ్యక్షుడు లాలా మున్నా కూడా దరఖాస్తు చేసుకుంటారని ప్రచారం ఉంది. ఖానాపూర్ నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఆయన తనయుడు రితీశ్ రా థోడ్, సీనియర్ నాయకులు హరినాయక్, సట్ల అశోక్, ఇంద్రవెల్లి జెడ్పీటీసీ అర్క పుష్పలత, పెంబి జెడ్పీటీసీ జానుబాయిలు దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ నుంచి కూడా టికెట్ ఆశిస్తూ రితీశ్ రాథోడ్ దరఖాస్తు చేసుకున్నారు. ఆయనతో పాటు అజ్మీరా ఆత్మారాం నాయక్, కోట్నాక విజయ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వందన దరఖాస్తు చేసుకున్నారు.

గెలుపు గుర్రాలెవరో?

- రానున్న ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ ఆరాటం
- టికెట్ కోసం పోటాపోటీ అర్జీలు
- చివరిరోజు దరఖాస్తులు పెరిగే అవకాశం

సాక్షి ప్రతినిధి,మంచిర్యాల: కమలం పార్టీలో దరఖాస్తులు జోరుగా సాగుతున్నాయి. ఈ తరుణంలో తూర్పు జిల్లాగా ఉన్న మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని ఐదు శాసనసభ స్థానాలకు ఇప్పటికే పదుల సంఖ్యలో అర్జీలు పెట్టుకున్నారు. ఆదివారం చివరి రోజు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే టికెట్ ఎవరికి దక్కుతుందోనని ఆసక్తి నెలకొంది. ఈసారి ఎలాగైనా అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ఆరాటపడుతున్న బీజేపీ అధిష్టానం ఆయా స్థానాల్లో సరైన అభ్యర్థులనే సమరంలోకి దింపాలని భావిస్తోంది. అర్జీలు ముగిశాక వివిధ దశల్లో అభ్యర్థులను వడపోత చేసి టికెట్లు ఖరారు చేయనున్నారు.

పోటాపోటీగా దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో పది స్థానాల్లో కొన్ని నియోజకవర్గాల్లో పోటాపోటీగా దరఖాస్తులు చేస్తున్నారు. అయితే పార్టీ లో క్రమశిక్షణ, విధేయత, నాయకత్వ లక్షణాలు, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేసే నాయకులకే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని నాయకులు చెబుతున్నారు. మంచిర్యాల స్థానానికి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, ముల్కల మల్లారెడ్డి, పులగం తిరుపతి, తులా ఆంజనేయులు, తులా మధుసూదన్, డా.విజయ్ రఘునందన్, గాదె శ్రీనివాస్ తదితరులు దరఖాస్తు చేసుకునే వారిలో ఉన్నారు. చెన్నూరు నుంచి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకట స్వామి, అందుగుల శ్రీనివాస్ తదితరులు దర ఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. బెల్లంపల్లి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కొయ్యాల ఏమాజీతోపాటు ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకట కృష్ణ తదితరులు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. సిర్పూర్ టికెట్ కోసం డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం టికెట్ కోసం పోటీ పడుతున్నవారిలో ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకర్గంలో ఆదివాసీ నాయకుడు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్‌టికెట్ ఆశిస్తున్నారు. ఆయనతో పాటు ఆత్మరాంనాయక్ పోటీ పడుతున్నారు. వీరితోపాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు.

'భగీరథ'.. వ్యథ!



ట్యాంకర్ కోసం బకెట్లు, డ్రమ్ములతో ఎదురుచూస్తున్న మహిళ

- తాగునీటి సరఫరా మరింత ఆలస్యం
- గ్రామాలకు మరో రెండు రోజులు ఆగాల్సిందే
- నేటి నుంచి పట్టణానికి సరఫరా అయ్యే అవకాశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరా మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జిల్లాకు నీటిని సరఫరా చేసే నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం మాటేగాంవ్ వద్ద గల ఫిల్టర్‌బెడ్‌లో హైవోల్టేజ్ కారణంగా 1400 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు విద్యుత్ మోటర్లు కాలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లాలోని ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు 872 గ్రామాలకు ఆరు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. వాటర్ గ్రిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విద్యుత్ మోటార్ల మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ ఇంకా పూర్తికాలేదు. ప్రస్తుతం రెండు మోటార్లు అందుబాటులోకి వచ్చి నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఒక ట్యాంక్ నిండాలంటే సుమారు 12 గంటల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. మరో మోటార్ నడిస్తే గానీ పూర్తిస్థాయిలో జిల్లాకు నీరందే అవకాశం లేదు.

కొనసాగుతున్న పనులు

హైవోల్టేజ్ కారణంగా కాలిపోయిన విద్యుత్ మోటార్లు, వైర్ల మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. శనివారం రాత్రి వరకు రెండు మోటర్లు వినియోగంలోకి వచ్చినట్లుగా సమాచారం. మరోమోటార్ ఆదివారంమధ్యాహ్నం వరకు వినియోగంలోకి వచ్చే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. అయితే జోరుగా కురుస్తున్న వర్షం ఈ పనులకు ఆటంకం కలిగిస్తోంది. దీంతో నీటి సరఫరా మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ప్రజలు బోర్లు, చేదబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ పంచాయతీలు వాటిని పట్టించుకోవడం లేదు. కొన్నిచోట్ల ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేస్తుండగా మరి కొన్నిచోట్ల అసలే పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలకు గంటల తరబడి ఎదురుచూపులు తప్పని పరిస్థితి. యథావిధిగా నీటి సరఫరా ప్రారంభం కావాలంటే మరో రెండు రోజులు పట్టే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది.

తొలుత మున్సిపాలిటీకి నీరందిస్తాం

విద్యుత్ మోటార్ల మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. శనివారం రాత్రి వరకు రెండు మోటార్లు ఓకే అయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ఆదిలాబాద్ పట్టణ వాసులకు నీరు అందేలా చూస్తాం. మరో మోటార్ బాగు కావాల్సి ఉన్నందున గ్రామాలకు కొంత ఆలస్యమయ్యే అవకాశముంది. అప్పటి వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తాం.

–వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఆదిలాబాద్

రాజీమార్గమే రాచమార్గం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వీఆర్ఆర్ వరప్రసాద్

- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ కేసులను రాజీమార్గం ద్వారా సత్వరం పరిష్కరించేందుకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని రాజీ కుదిర్చి పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్టులో కేసు వేస్తే ఏళ్ల తరబడి తిరగాల్సి వస్తుందని, సమయం, డబ్బు వృథాతో పాటు మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుందన్నారు. ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో కేసులను సత్వరం పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. ఇందులో రాజీ అయిన కేసుపై అప్పీల్ చేయడానికి ఉండదన్నారు. అనంతరం లోక్ అదాలత్ ఆవశ్యకతను వివరించారు. కేసుల పరిష్కారం కోసం వచ్చిన కక్షిదారుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,975 కేసులు పరిష్కారం అయినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తులు మంజుల సూర్యవార్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, డీఎస్పీ ఉమేందర్ తదితరులున్నారు.

రేపటి నుంచి అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

ఎదులాపురం: అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ కోరారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు, అసోసియేషన్ బాధ్యులతో కలిసి సమ్మె పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, పదవీ విరమణ బెనిఫిట్ టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ. 5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. తన న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వానికి పలుమార్లు నివేదించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ క్రమంలోనే సమ్మెకు సిద్ధమయ్యామన్నారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంధుమతి, సంగీత, రాధ, ఏఐటీయూసీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి

ఎదులాపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11 నుంచి తలపెట్టిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న కోరారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) నాయకులతో సమ్మె వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, కోశాధికారి రత్నమాల, సునీత, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీల్లో జిల్లా నాయకులకు చోటు



కైలాస్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతుంది. ఈ మేరకు ఏఐసీసీ శనివారం పలు కమిటీలను శనివారం ప్రకటించింది. ఇందులో పలువురు జిల్లా నాయకులకు చోటు దక్కింది. ఎన్నికల మేనిఫెస్టో కమిటీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, ఎన్నికల వ్యూహ కమిటీలో డాక్టర్ నరేశ్ జాదవ్, ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులుగా భరత్ చౌహాన్‌కు చోటు కల్పిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

వాగుదాటి వైద్యం అందించి..


కన్నాపూర్‌ వాగును దాటుతున్న వైద్యులు

సిరికొండ: మండలంలోని మారుమూల గ్రామమైన కన్నాపూర్‌, కన్నాపూర్‌తండా గ్రామాల్లో శనివారం పిట్టబొంగారం పీహెచ్‌సీ వైద్యులు వాగును దాటి వెళ్లి ఆ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి వైద్యులు ప్రతాప్‌నాయక్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ జలందర్‌, గంగమ్మ, హెల్త్‌ సూపర్‌వైజర్‌ విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఆయిల్‌ ప్యాకెట్లు చోరీ

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలో శనివారం ఆయిల్‌ ప్యాకెట్ల బాక్స్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. భుక్తాపూర్‌లోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్‌ఎన్‌కే షాపు ఎదుట 12 బాక్స్‌లతో కూడిన ఐషర్‌ వ్యాన్‌ను నిలిపి ఉంచారు. గమనించిన దుండగులు ఆ వాహనంలో నుంచి ఆయిల్‌ ప్యాకెట్ల బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.21వేల వరకు ఉంటుందని బాధితుడు నంద కిషోర్‌రెడ్డి టూ టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై ప్రదీప్‌ కుమార్‌ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్కా, పేకాట ఆడితే చర్యలు


అరెస్ట్‌ చూపుతున్న ఎస్సై సందీప్‌

భైంసాటౌన్‌: మట్కా, పేకాట ఆడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై సందీప్‌ అన్నారు. పట్టణంలో మట్కా ఆడుతున్న మహమ్మద్‌ సుల్తాన్‌, మహమ్మద్‌ మోబీన్‌ను శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.4950 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

న్యాయం చేయండి సారూ...


పోచుబాయి

కాగజ్‌నగర్‌రూరల్‌: తన పట్టా భూమిని పెద్దకుమారుడు తన అ ధీనంలో పెట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ వృద్ధురాలు కన్నీరుపెట్టుకుంటుంది. తనకు న్యాయం చేయాలని కాగజ్‌నగర్‌ మండలంలోని సీతానగర్‌ గ్రామానికి చెందిన వృద్ధురాలు మౌల్కార్‌ పోచుబాయి శనివారం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల ప్రకారం... పోచుబాయి కి ముగ్గురు కుమారులు తులసీరాం, విశ్వనాథ్‌, గణపతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1999లో భర్త మల్లయ్య మృతిచెందగా, 40 ఎకరాల భూమిలో నుంచి ఐదు ఎకరాలు తల్లి పోషణకు కేటాయించి మిగతాది పంపకాలు చేసుకున్నా రు. అప్పటి నుంచి పోచుబాయి పెద్ద కుమారు డి వద్ద ఉంటుంది. తల్లి పేరుపైన ఉన్న భూ మిని పట్టా చేయించాలని పెద్ద కుమారుడు వే ధించడం మొదలుపెట్టాడు. పోచుబా యి కాగజ్‌నగర్‌లో ఉంటున్న చిన్న కుమార్తె ప్రమీల వద్దకు వెళ్లింది. తనకు ఎలాగైన న్యాయం చేయాలని వృద్ధురాలు వేడుకుంటుంది.

ఓ క్షణం ఆలోచించు



‘‘ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరం చదువుతున్న తాంసి మండలం పొలోది గ్రామానికి చెందిన అడెపు శృతి(17) మొహర్రం సెలవులకు ఇంటికి వచ్చింది. తనతో చనువుగా ఉంటున్న గ్రా మంలోని యువకుడి ఇంటికి వెళ్లిన విష యం తండ్రికి తెలిసి తనను మందలిస్తాడనే భయంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంది.’’



‘‘భీంపూర్‌ మండలంలోని అందర్‌బంద్‌ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే అనురాగ్‌ (13) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుకోవాలిన వయస్సులో బడి మానేసి ఇంటి వద్ద ఉండడంతో బుద్ధిగా బడికి వెళ్లి చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారనే కారణంతో తన నూరేళ్ల జీవితానికి ముగింపు పలికి తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చాడు.’’



‘‘జైనథ్‌ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన డౌరే రవీందర్‌ అనే కౌలు రైతు తనకున్న మూడెకరాలతో పాటు మరో 14ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేశాడు. వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కన్పించకపోవడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం ఆయన భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డునపడ్డారు. భార్య స్వప్న కూలీ పనిచేస్తు పిల్లలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



‘‘బోథ్‌ మండలం ధన్నూర్‌ గ్రామానికి చెందిన పాముల సంతోష్‌ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆటోను ఫైనాన్స్‌పై తీసుకున్నాడు. గిరాకి ఆశించనంతగా రాకపోవడం, కుటుంబ పోషణ భారమవుతుందనే కారణంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతని భార్య, ఇద్దరు పిల్లలు ఆధారాన్ని కొల్పోయి దిక్కులేని వారిగా నానా అవస్థల నడుమ కాలం వెల్ల దీయాల్సి వస్తోంది.



- చిన్నపాటి కారణాలకే మృత్యుఒడికి
- యమపాశంగా మారుతున్న క్షణికావేశం
- అనాథలవుతున్న పిల్లలు... కన్నవారికి పుత్రశోకం
- నేడు ఆత్మహత్యల నివారణ దినం

కైలాస్‌నగర్‌: పుట్టిన ప్రతి మనిషికి జీవితంలో ఎదో ఒక సమస్య ఎదురవుతూనే ఉంటుంది. సమస్య ఎంత పెద్దదైనప్పటికీ దానికి పరిష్కారం ఉంటుంది. అయితే ఆ సమస్యను స్వీకరించే తీరు, దాన్ని పరిష్కరించుకునే విధానమే కీలకం. తమకు ఎదురైన సమస్యను తెలుసుకుని దానిని అధిగమించే మార్గాలను వెతుకుంటే సమస్య కన్న పరిష్కార మార్గాలే ఎక్కువగా కన్పిస్తాయి. తమకున్న సమస్యనే పెద్దదిగా భావించి విచక్షణ కొల్పోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాలపడుతున్నారు. ఎదురైన సమస్యతో బాధపడకుండా మన అనుకునేవారికి చెప్పుకుంటే సగం పరిష్కారం అప్పుడే లభిస్తోంది. పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆలోచన చేయకుండా ఆత్మహత్యకు పాల్పడి పిల్లలను వీధి పాలు చేస్తున్నారు. పిల్లలు తెలిసి, తెలియని వయస్సులోనే ఆత్మహత్యకు ఒడిగట్టి తల్లిదండ్రులకు తీరని దుఖాన్ని మిగుల్చుతున్నారు.

మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యలు



మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుంటాయి. డిప్రెషన్‌లో ఉన్న వ్యక్తి నడవడిలో మార్పు వస్తుంది. గమనించి వైద్యుల వద్ద చికిత్స, కౌన్సెలింగ్‌ అందిస్తే వారిని ఆత్మహత్యలకు పాల్పడకుండా కాపాడవచ్చు. మానసిక సంఘర్షణకు గురై, సహనం లేనటువంటి వారు క్షణికావేశాల్లో ఆత్మహత్యలకు పాలపడుతున్నారు. ఇలాంటి వారిని ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్‌ చేస్తే వారు ప్రాణాలు తీసుకోకుండా చూడవచ్చు.

– డాక్టర్‌ ఓంప్రకాశ్‌, రిమ్స్‌ మానసిక వైద్య నిపుణులు

బతికే మార్గం చూడాలి



చేతినిండా పనిదొరక్క, ఉపాధి అవకాశాలు లేక కుటుంబ భారాన్ని మోయలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. పంటలు సరిగ్గా పండక, గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా చేసుకోవడం ద్వారా వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆత్మహత్యలను అరికట్టేలా చర్యలు చేపట్టాలి.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్నాం



ఆత్మహత్యలు చేసుకోకుండా ఎస్సైలు తమ పరిధిలో రెగ్యులర్‌గా కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లి ఆత్మహత్యలు చేసుకోకుండా వాటి వల్ల ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆత్మహత్యలనేవి సమస్యకు ఏ మాత్రం పరిష్కారం కావు. సమస్యలు వచ్చినపుడు ఆందోళన చెందకుండా విచక్షణతో ఆలోచిస్తే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్‌ జిల్లా ఎస్పీ

సంబురంగా తీజ్‌


నృత్యాలు చేస్తున్న యువతులు, మహిళలు

జన్నారం: లంబాడి గిరిజనుల పండుగ తీజ్‌ను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి లంబాడాలు పొనకల్‌ జువ్విగూడలోని సేవలాల్‌ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి మండల కేంద్రంలోని అంగడీ బజార్‌లోని సేవలాల్‌ చౌక్‌ వద్దకు చేరుకున్నారు. వారం రోజులుగా మట్టిలో వేసిన గోధుమలు, వరిగింజలు మొకలెత్తగా వాటిని నెత్తిన పెట్టుకుని మహిళలు సంప్రదాయ నృత్యాలు చేశారు. పురుషులు ఒకే రంగులోని పట్కా ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంగడీబజార్‌ నుంచి పోలీస్‌స్టేషన్‌ సమీపంలోని వాగు వరకూ నృత్యాలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం వాగులో తీజ్‌ బుట్టలను నిమజ్జనం చేశారు.

ప్రముఖుల హాజరు..

జన్నారం మండలంలోని తీజ్‌ ఉత్సవాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు హాజరయ్యారు. బీఆర్‌ఎస్‌ ఖానాపూర్‌ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌ నాయక్‌ హాజరై పురుషులతో కలిసి నృత్యం చేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర ఫ్లోర్‌ లీడర్‌ జానుభాయి, బీఎస్పీ అభ్యర్థి బన్సిలాల్‌, కాంగ్రెస్‌ నాయకులు కిషన్‌ నాయక్‌లు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బంజార సేవా సమితి, ఉత్సవ సమితి నాయకులు సందేశ్‌, ప్రకాశ్‌నాయక్‌, దశరథ్‌, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌లు రమేశ్‌, రాజన్న, వైస్‌ ఎంపీపీ వినయ్‌కుమార్‌, కోఆప్షన్‌ సభ్యుడు మున్వర్‌ అలీఖాన్‌, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్‌, పొనకల్‌ సర్పంచ్‌ జక్కు భూమేశ్‌, బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు రాజ రాంరెడ్డి, నాయకులు ఫజల్‌ఖాన్‌, జనార్దన్‌ ఉన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్‌ కాలనీ, చందారం గ్రామంలో లంబాడాలు తీజ్‌ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

బోధన్‌టౌన్‌(బోధన్‌): రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర , జిల్లాల సరిహద్దుల్లో చేపట్టే పకడ్బందీ చర్యలపై శనివారం నిజామాబాద్‌ జిల్లా బోధన్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సాలూర రోడ్డులోని ఎస్‌ఎస్‌ కన్వెన్షన్‌ హాలులో మహారాష్ట్ర పోలీసులతో పాటు, రాష్ట్రంలోని ఆరు జిల్లాల ఎస్పీలు సమావేశం నిర్వహించారు. ఇందులో నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ వి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టాలన్నారు. మద్యం, నగదు, మాదక ద్రవ్యాల సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిజామాబాద్‌, నిర్మల్‌, ఆదిలాబాద్‌, కామారెడ్డి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, నాందేడ్‌ జిల్లా సరహద్దుల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్‌ నిబంధనల మేరకు చెక్‌ పోస్టులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేసుకొని నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. నాన్‌ బెయిలబుల్‌ వారెంట్‌ విషయంలో ఇరు జిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాల న్నారు. అంతర్రాష్ట్ర చెక్‌ పోస్టులైన సాలూర, కండ్గావ్‌, కందకుర్తి, పోతంగల్‌ వద్ద చెక్‌ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు అంతర్‌ జిల్లా చెక్‌పోస్టులు డోడ్గాన్‌ (సోన్‌) బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇందల్వాయి టోల్‌ప్లాజా, మల్లారం గండి, యంచ (బాసర)ల వద్ద చెక్‌ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సరిహద్దులో హైవే పెట్రోలింగ్‌, మొబైల్‌ పెట్రోలింగ్‌ పెంచాలని, పోలీస్‌ అధికారులు వాట్సాప్‌ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహాయ సహకారాలు అందించుకుంటూ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆదిలాబాద్‌ జిల్లా ఎస్పీ ఉదయ్‌ కుమార్‌, నిర్మల్‌ జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌, జగిత్యాల జిల్లా ఎస్పీ భాస్కర్‌, కామారెడ్డి జిల్లా ఎస్పీ బి శ్రీనివాస్‌, నాందేడ్‌ జిల్లా (బోకర్‌) అదనపు ఎస్పీ కేపీ ధరణి, నిజామాబాద్‌ జిల్లా అదనపు డిప్యూటీ కమిషనర్‌ జయరామ్‌, నిజామాబాద్‌ జిల్లా కమర్షియల్‌ ట్యాక్స్‌ అధికారి లావణ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ


పాల్గొన్న వివిధ జిల్లాల ఎస్పీలు, అధికారులు

ఎవరిని అవమానపరిచే ఉద్దేశం లేదు

- ఏఎంసీ మాజీ చైర్మన్‌ పి.కృష్ణ

భైంసాటౌన్‌: భైంసా ఏఎంసీ చైర్మన్‌ రాజేశ్‌బాబును కించపరిచే ఉద్దేశం తనకు లేదని ఏఎంసీ మాజీ చైర్మన్‌ పి.కృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి టికెట్‌ ఖరారు అయిన సందర్భంలో ఆయన అభిమానిగా తన పేరిట అప్పుడే ఫ్లెక్సీ ఏర్పాటు చేశానని, అది కూడా తన అనుచరులు ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. అయితే దీన్ని రాజేశ్‌బాబు తనకు వ్యతిరేకంగా, అవమానపరచాలనే ఉద్దేశంతోనే ఏర్పాటు చేశానని ఆపాదించుకోవడం బాధాకరమన్నారు. గతంలో ఆయనకు చైర్మన్‌ పదవి కేటాయింపు విషయంలోనూ జాప్యంలో తన పాత్ర ఉందంటూ పార్టీకి చెందిన పలువురి వద్ద తన ప్రస్తావన తెచ్చారని గుర్తు చేశారు. ఇటీవల మంత్రి తలసాని దాడి ఘటన వీడియో ప్రచారంలోనూ తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పార్టీలోని అసమ్మతి వర్గం ఆయన్ను తప్పుదోవ పట్టిస్తున్నారని, తనకు రాజేశ్‌బాబుతో ఎలాంటి విబేధాలు లేవన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌చైర్మన్‌ జేకే పటేల్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు తోట రాము, ఆసిఫ్‌, ఫారూక్‌, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్‌ పి.కృష్ణ

సొంత పార్టీ వారే అవమానిస్తున్నారు

- ఏఎంసీ చైర్మన్‌ రాజేశ్‌బాబు

భైంసాటౌన్‌: ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నామనే కారణంతోనే తనను సొంత పార్టీ వారే అవమానిస్తున్నారని భైంసా ఏఎంసీ చైర్మన్‌ రాజేశ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. భైంసా ఏఎంసీ కాటన్‌మార్కెట్‌ ప్రవేశద్వారం వద్ద వెలిసిన ఫ్లెక్సీపై ఆయన స్పందించి శనివారం ఏఎంసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల మంత్రి తలసాని తనపై చేసిన దాడి వీడియోను స్థానిక బీఆర్‌ఎస్‌ శ్రేణులే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసి అవమానపరిచారని, ఇప్పుడు మరింత రెచ్చగొట్టేలా ఏఎంసీ ఎదుటే తనను ఉద్దేశించేలా వ్యాఖ్యలు చేస్తూ దురుద్దేశపూర్వకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని ఉద్యమంలో పాల్గొన్నానని, అందుకే తనకు ఏఎంసీ చైర్మన్‌ పదవి వరించిందన్నారు. కొందరి మాదిరిగా పదవి కోసం ఊడిగం చేయలేదన్నారు. ఇకనైనా ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. నియోజకవర్గంలో పథకాల అమలులో అవినీతికి పాల్పడుతున్నారని, దీంతో పార్టీకి చెడ్డ పేరు వస్తోందన్నారు. తనను ఎంత అవమానించినా పార్టీలోనే ఉంటానన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు జీవీ రమణారావు, సాల్లి రమేశ్‌, పండిత్‌రావు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్‌ రాజేశ్‌బాబు

పొన్కల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

మామడ: మండలంలోని పొన్కల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వినతిపత్రం అందించారు. కాగా, సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకువెళ్లి పొన్కల్‌ మండల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హరీశ్‌ సానుకూలంగా స్పందించారని ఐకేరెడ్డి తెలిపారు. మంత్రి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్‌ రాంకిషన్‌రెడ్డి, మామడ పీఏసీఎస్‌ చైర్మన్‌ హరీశ్‌కుమార్‌, వైస్‌చైర్మన్‌ భాస్కర్‌రావు ఉన్నారు.


హరీశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి, నాయకులు

గొర్రెల యూనిట్ల పరిశీలన


గొర్రెలను పరిశీలిస్తున్న గంగాధరయ్య

సోన్‌: మండలంలో రెండో విడత పంపిణీ చేసిన గొర్రెలను జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్‌ గంగాధరయ్య శనివారం పరిశీలించారు. న్యూబొప్పారం గ్రామంలో 12 మంది లబ్ధిదారులకు వచ్చిన గొర్రెల యూనిట్లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. సహాయ సంచాలకుడు డాక్టర్‌ సురేశ్‌, సర్పంచ్‌ హరిత, మండల పశువైద్యాధికారి మహేశ్‌, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు బండి మహేందర్‌ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


లింగన్న మృతదేహం

గుడిహత్నూర్‌: మండలంలోని జాతీయ రహదారి 44పై వైజాపూర్‌ యూ టర్న్‌ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల్‌పూర్‌ గ్రామానికి చెందిన నైతం లింగన్న (48) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. లింగన్న మోటార్‌ సైకిల్‌పై కొడుకును చించుఘాట్‌లో ఉండే అత్తగారి ఇంట్లో వదిలి రాత్రి గోపాల్‌పూర్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. సీతాగొంది నుంచి వైజాపూర్‌ యూటర్న్‌ సమీపంలో రాత్రి ఎదురుగా వస్తున్న మాక్స్‌ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో రిమ్స్‌ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్‌ తెలిపారు.

వానలో తడిచి.. శిబిరంలో నిద్రించి..


శిబిరంలోనే నిద్రిస్తున్న మహిళా ఉద్యోగులు

- దీక్ష కొనసాగిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్‌ ఉద్యోగులు


భారీ వర్షంలోనూ శిబిరంలో దీక్ష కొనసాగిస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌ రూరల్‌: డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్‌ ఉద్యోగులు చేపట్టిన దీక్ష 13వ రోజుకు చేరింది. రోజుకో రీతిలో నిరసన తెలిపిన ఉద్యోగులు శనివారం భారీ వర్షంలోనూ దీక్ష కొనసాగించారు. అలాగే రాత్రి శిబిరంలోనే బస చేసి నిరసన తెలిపారు. గజిటెడ్‌ హెడ్మాస్టర్ల సంఘం నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్‌ చేశారు.

ఆపరేషన్‌ పేకాట..!

- క్వారీ టెంపుల్‌ వద్ద ఇద్దరు అరెస్ట్‌ ఐదుగురు పరార్‌
- రూ. 4,33,500 స్వాధీనం
- కవరేజ్‌కి వెళ్లిన విలేకరిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై

మంచిర్యాలక్రైం: జిల్లాలో పేకాటాడుతున్న వారిపై పోలీస్‌ యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసింది. పక్కా సమాచారం మేరకు ఇద్దరు ఎస్సైలు రెండు బృందాలుగా ఏర్పడి ‘ఆపరేషన్‌ పేకాట’ పేరుతో శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని క్వారీ అటవీ ప్రాంతంలో దుర్గాదేవి ఆలయం వద్ద పేకాటాడుతున్నారనే సమాచారం మేరకు హాజీపూర్‌ ఎస్సై నరేష్‌, మంచిర్యాల టౌన్‌ ఎస్సై రాజేందర్‌ దాడిచేశారు. ఐదుగురు పేకాట రాయుళ్లు తప్పించుకోగా ఇద్దరిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4లక్షల 33వేల 5వందలు నగదు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా పేకాటాడుతూ అరెస్ట్‌ అయిన వారిలో పెద్దపెల్లి జిల్లా రామగుండంకి చెందిన సాదుల సదానందం, ఎన్‌టీపీసీకి చెందిన పల్లె ఆంజనేయులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ రాజు తెలిపారు. తప్పించుకున్న వారిలో మంచిర్యాల, రామగుండంకు చెందిన వారు ఉండడం గమనార్హం.


పట్టుకున్న కారు, నగదు, పేకాటరాయుళ్లతో ఎస్సై

విలేకరిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై...

పేకాటరాయుళ్ల అరెస్ట్‌ విషయం తెలుసుకున్న ఓ విలేకరి వార్త కవరేజీకి సంఘటన స్థలానికి వెళ్లి ఫొటోలు తీసే ప్రయత్నం చేయగా ఎస్సై అతడిపై దురుసుగా ప్రవర్తించాడు. విలేకరి అని చెప్పిన వినకుండా అయితే ఏమిటని, అతడి కారును ఫొటోలు తీశాడు. పేకాటరాయుళ్లను అరెస్టు చేసింది ఓ చోట అయితే మారో చోటకి ఎందుకు తరలిస్తున్నారని, సదరు విలేకరి ఎస్సైని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.